
అపార్ట్‌మెంట్‌లో వుండాలన్న నా చిరకాల వాంఛ మావారికి హైద్రాబాదుకు ట్రాన్స్‌ఫరవగానే తీరింది...!

'విజయవాడలో ఊరికి దూరంగా విసిరేసినట్లున్న ఇంట్లో కాపురం... పిలిస్తే వినపడి పలికేంత దూరంలో ఒక్క ఇల్లూ లేదు... పనంతా అయ్యాక కాసేపు కాలక్షేపానికి మాట్లాడుకునేందుకు ఎవరిళ్లకైనా వెళ్లాలంటే ఇల్లు తాళం వేసుకువెడితే, మనసంతా ఇంటి మీదే... ఎవరొచ్చి తాళం పగలకొట్టి ఇల్లు దోచుకుపోతారోనని...



అదే మాట మా ఆయనతో అంటే "అపార్ట్‌మెంట్లలో నీళ్లకిబ్బంది అని నా ఫ్రెండ్ చెప్పాడోయ్..." అని సందేహం వెలిబుచ్చారు...

"ఆ... అదేం వుండదు... ఇప్పుడందరూ అపార్ట్‌మెంట్లలోనే వుంటున్నారు... అంత నీళ్లకిబ్బంది అయితే వాళ్లందరూ ఎలా వుండగలుగుతున్నార"ని నచ్చచెప్పి ఒప్పించి, కాచిగూడా స్టేషన్‌కు దగ్గరగా వున్న 'క్లాసిక్' అపార్ట్‌మెంట్స్ సెకెండ్ ఫ్లోర్‌లో టూబెడ్ రూమ్



ఫ్లాట్‌లోకి దిగాం.

నాలుగు ఫ్లాట్‌లున్న ఆ ఫ్లోర్‌లోని తతిమా మూడు ఫ్లాట్లలో రెండిళ్లలోని ఆడవాళ్లు ఉద్యోగస్థులు... పొద్దున ఎనిమిది గంటలకెడితే రాత్రి ఎనిమిది గంటలకే గూటికి చేరుకుంటారు... పగలంతా తాళాలు... రాత్రంతా నిద్దర్లు... వాళ్ల మొహాలు చూడడమే అపురూపం అయితే ఇహ పిచ్చాపాటికి టైమేది...?

నాలుగో ఫ్లాట్‌లో వున్న గోమతితోనే కాస్త కాలక్షేపం... కానీ ఆమె కాలక్షేపం అంతా టీ.వీ.తోనే...

గోమతి నాలానే గృహిణి... ఆమెకిద్దరు కూతుళ్లు... రెండు, నాలుగు తరగతులు చదువుతున్నారు... మొగుడు ఏదో కంపెనీలో సేల్స్ మేనేజరు... నెలలో మూడు వారాలు టూర్లలోనే తిరుగుతాడు.

'పోనీలే గుడ్డిలోమెల్ల... కనీసం గోమతితోనైనా స్నేహం చేసి మాట్లాడొచ్చని ముందుగా నేనే వాళ్లింటికెళ్లి నన్ను నేను పరిచయం చేసుకున్నాను... గోమతి నాతో పరిచయం అవడం తన అదృష్టం అని మురిసిపోయి నన్ను కూర్చోమని మర్యాద చేసి కాఫీ ఇచ్చింది.

కాసేపు ఆ కబుర్లూ ఈ కబుర్లూ మాట్లాడుకున్నాక ఇంటికి వచ్చేస్తూ బుద్ధిగడ్డితిని "మీకే విధమైన సహాయం కావాలన్నా మొహమాట పడకుండా అడగండి గోమతీ..." అని చెప్పడం తప్పయిపోయిందని తరువాత అనిపించింది.

"అత్తయ్యా..." అని వరుస కలుపుతూ గోమతి చిన్న కూతురు ప్రభ ఓ శనివారం మధ్యాహ్నం వచ్చి, "మీరు చతుర, విపుల మాస పత్రికలు కొంటారటగా...? అమ్మ అడిగి ఇప్పించుకురమ్మంది... చదివేసి తొందరగా తిరిగి ఇచ్చేస్తానంది...!" అంటూ అడిగింది.

ఆ నెల విపుల, చతురలను ఇస్తూ "తొందరేం లేదు. నే చదివేసాను... నెమ్మదిగా చదివి ఇమ్మనమను..." అని చెప్పి ఇచ్చి పంపించాను... ఆ పుస్తకాలు మళ్లీ నా చేతికి రానేలేదు... చదివేసినవేకదా అని నేనూ అడగనూ లేదు...

ఆ రోజు పొద్దున్నే ఆయనకు ఆఫీసుకు వంట, టిఫిన్ చేసే ముమ్మరంలో వున్నాను... కాలింగ్‌బెల్ వినిపిస్తే ఆయన బాత్‌రూమ్‌లో వుండడం వల్ల నేనే వెళ్లి తలుపు తెరిచాను... గోమతి పెద్ద కూతురు రూప స్కూలు యూనీఫామ్‌లో నిలబడిఉంది.

"అత్తయ్యా, మీ ఇంట్లో కల్లీగ్ కార్న్‌ఫ్లేక్స్ వుంటే ఓ పాకెట్ ఇప్పించుకురమ్మన్నది అమ్మ... రేపు మార్కెట్ నుంచి తీసుకురాగానే ఇస్తానని చెప్పింది...!" అని అడిగింది.

"అవి మా ఇంట్లో కొనమమ్మా... మాకు సయించవు...!"

**ఎ. సువర్ణ**

"అయ్యో... మీకు కార్న్‌ఫ్లేక్స్ నచ్చవా...? పోనీ మాగీ నూడిల్స్ వుంటే ఇయ్యండి...!

"మాకవేవీ నచ్చవు... అటుకులు, రవ్వ వున్నాయి... అవేవైనా ఇవ్వనా...?" అడిగాను.

"అటుకులా?... రవ్వా?..." అవేవో వినకూడనివన్నట్లుగా మొహం చిట్లించుకుని, "సరే... ఏం చెయ్యడం? అటుకులే ఇయ్యండి... ఎలాగో వాటితోనే అడ్జస్ట్ అవుతాం... తొందరగా ఇయ్యండి ఆంటీ... అవతల నాకు స్కూలుకు టైమైపోతున్నది..." అని అష్టవంకర్లు తిరుగుతూ నేనిచ్చిన అటుకుల పాకెట్ తీసుకుని వెళ్లింది.


అప్పటికే వాళ్ల చేబదుళ్లతో కాస్త విసిగి ఉన్నాను.

'అడిగేది అప్పు... వాళ్లకే మనం అప్పు పడిన వాళ్లలాగా అధికారం...' అని విసుక్కుంటూ తలుపు గడియపెట్టి లోపలకొచ్చి రొట్టెలకు గోధుమ పిండి తడుపుతూంటే మళ్లీ కాలింగ్‌బెల్ మోగింది.

స్నానంచేసి వచ్చిన ఆయనెళ్లి తలుపులు తెరిచారు... ఈసారి చిన్నకూతురు ప్రభ లోపలి కొచ్చి. "అత్తయ్యా, అమ్మ నాలుగు పచ్చిమిరప కాయలు అడిగి పట్టుకురమ్మన్న"దంటూ అడిగింది...

"కాస్త ఆగు ప్రభా... గోధుమపిండి తడుపుతున్నాను. చేతులు కడుక్కొచ్చి ఫ్రిజ్‌లోంచి తీసిస్తాను..." అన్నాను.

"అయ్యో, అత్తయ్యా ఆగడానికి వీలవదు... అవతల అమ్మ మూకుడు స్టవ్‌మీద పెట్టి పోపు



రామేశ్వరంలో దుర్గాప్రసాద్ యమ్.ఫిల్. గ్రంథం "కె.బి. కృష్ణ కథలు - ఒక పరిశీలన"ను రాజోలు శాసనసభ్యులు అల్లూరి కృష్ణంరాజు ఆవిష్కరించిన దృశ్యం. వేదికపై కె.బి. కృష్ణ, దుర్గాప్రసాద్, శాసనసభ్యులు మరియు దొమ్మేటి ఉమామహేశ్వరరావు (ఛైర్మన్: ఎ.ఎమ్.సి., రాజోలు) ఉన్నారు.

వేసింది... తొందరగా తీసికెళ్లకపోతే పోపు మాడిపోతుంది...!" అన్న ఆ పిల్ల మాటలు నాకు అరికాలిమంట నెత్తికెక్కేట్లు చేసినయ్...

"సరే... సరే... నేనిస్తాలే" అని ఆయన పచ్చిమిరపకాయలిచ్చి పంపించారు.

ఇలా ప్రతిదానికీ వేళాపాళా లేకుండా చేబదుళ్లకు పంపవద్దని గోమతికి గట్టిగా చెప్దామని మధ్యాహ్నం వాళ్లింటికెళ్లాను.

నేవెళ్లేసరికి గోమతి 'మా' టీ.వీ.లో వచ్చే "అవాక్కయ్యారా...?" కార్యక్రమం చూడడంలో తీక్షణంగా నిమగ్నమయి ఉంది. నేవచ్చింది కూడా తెలియనంతగా చేతిలో సెల్‌ఫోన్‌తో కూర్చుని ఉంది.

నా రాక తెలుపుతున్నట్లుగా "హాయ్ గోమతి గారూ..." అన్నాను.

"హాయ్! కుసుమగారా... రండి... రండి... మీరు 'అవాక్కయ్యారా?'లో మీ నెంబర్ ఎన్‌రోల్ చేసుకున్నారా...? అని అడుగుతూ... నిలబడే వున్నారు... కూర్చోండి..." అంది.

కూర్చుంటూ... "పొద్దున పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ చేసిపెట్టడానికేం సామాన్లు లేనట్లున్నదే...?" అని మెల్లగా మొదలుపెట్టాను.

"ఏం చెయ్యమంటారండీ...? ఆయనెప్పుడూ టూర్లలోనే వుంటారు... ఇంటిపని, బజారు పని, పిల్లల పనులు అన్నీ ఒక్కదాన్నే చూసుకోవడం కష్టంగావుంది... ఇంట్లో ఏం వున్నదీ లేనిదీ చూసుకుని, సమయానికి తెచ్చుకోలేకపోతున్నాను...!" అన్నదామె. ఏదో పొరపాటంటుందనుకుంటే నాకే ఎసరు పెట్టింది.

"మీకేమండీ... హాయిగా మీ వారు ఎప్పుడూ ఊళ్లోనే వుంటారు... పైగా పిల్లాపీచూ అనే జంజాటం లేదు" అని, తన కష్టాలు ఏకరువు పెట్టి... మైనస్ పాయింట్లు చెప్పడంతోపాటు నాకున్న ప్లస్ పాయింట్లు చెప్పి, తను కష్టపడి పోతున్నట్లు, నేను సుఖపడిపోతున్నట్లుగా మాట్లాడిన ఆ మహా ఇల్లాలితో ఏం చెప్పినా ఉపయోగం వుండదని మాట్లాడకుండా వచ్చేశాను.

మర్నాడు తెల్లారేసరికి రూప హాజరు... "అత్తయ్యా మా కుక్కర్ వెయిట్ పాడై పోయింది... మీ కుక్కర్ వెయిట్ ఓసారి ఇప్పించుకు రమ్మన్నది అమ్మ...!"

"మా కుక్కర్ వెయిట్ మీకుక్కర్‌కి సరిపోదు... మీది ప్రిస్టేజీ... మాది బటర్‌ఫ్లై...!"

"అయితే కుక్కరే ఓసారి ఇయ్యండి ఆంటీ... మా వంట పూర్తవగానే పట్టుకొచ్చి ఇచ్చేస్తాను".

"నీకు కుక్కరిస్తే నేనెలా వంట చేస్తాను...?"

"అంకుల్‌కి పదిగంటలకిగా ఆఫీసు...! మాకు స్కూలు ఎనిమిది గంటలకేగా... మా వంట అయిపోగానే కుక్కరు పట్టుకొచ్చిస్తాను... అప్పుడు మీరు వంటచెయ్యండి..." అని రూప తనే సొల్యూషన్ చెప్పేసరికి నాకు ఎక్కడలేని కోపం వచ్చింది.

ఆయనక్కడే కూర్చుని ఇదంతా పరికిస్తూ... అయిందా నీ అపార్ట్‌మెంట్ ముచ్చట అన్నట్లుగా నన్నే చూస్తున్నారు.

నాకు ఉడుకుమోత్తనంతో పాటు పట్టరానంత కోపం కూడా వచ్చింది... కోపంలో నేనేమైనా అన్నానంటే సదా టూర్‌లలో తిరుగుతూ కుటుంబ బాధ్యతలు పట్టని తన భర్త బాధ్యతా రాహిత్యాన్ని చిలవలు పలవలుగా వర్ణించి, ఓ పురాణంలా చెప్పి, ఏ టూర్లూ వెళ్లక్కరలేని చక్కటి ఉద్యోగం చేస్తూ ఎప్పుడూ ఇంటిపట్టునే వుండి,

పిల్ల జెల్లా లేకపోయినా కుటుంబ బాధ్యతలను చూసే నా భర్తను మెచ్చుకుని నా అదృష్టాన్ని పొగిడి ఎక్కడ దిష్టిపెడుతుందో గోమతి అన్న భయంతో నోరెత్తకుండా వుండిపోయాను.

ఇప్పుడు గోమతికి, ఆమె పిల్లలకూ మా ఇల్లు 'ఫుడ్‌వరల్డ్', 'సూపర్‌మార్కెట్' అయిపోయింది.

పొద్దున్నే బిజీగా వుండే సమయంలో మాట మాటికీ వచ్చి కాలింగ్ బెల్ నొక్కి బాధపడడం ఎందుకని, మా వారు గోమతి కూతుళ్లు సరాసరి లోపలకు రావడానికని తలుపులు బార్లాగా తెరిచి ఉంచుతున్నారు.

ఆఖరికి విసుగొచ్చి "ఈ అపార్ట్‌మెంట్ వద్దండీ...! మరోటి చూడండీ... మారిపోదాం...! అన్నాను...

నా మాటలకు నవ్వుతూ "పిచ్చిదానా, అక్కడింకో గోమతి వుండదని ఏమిటి...?" అన్న ఆయన పంచతంత్రంలోని కాకి, పాము కథ చెప్పారు.

'చెట్టుపైన గూట్లో తాము పెట్టే గుడ్లన్నీ చెట్టుకింద తొర్రలో వున్న పాము, తాము మేత కోసం బయటకు వెళ్లిన సమయం చూసి పైకి పాకి వచ్చి గూట్లో పొదగడానికి పెట్టి వెళ్లిన కాకి దంపతుల గుడ్లను ఆరగించి వెళ్లిపోతున్నది. ఆడ కాకికి ఇదెంతో దుఃఖంగా వుంది... మగకాకితో మనమీ చెట్టునొదిలేసి మరో చెట్టు మీదికెళ్లి గూడు కట్టుకుని గుడ్లు పెట్టి పిల్లల్ని పొదుగుదామంటుంది.

అందుకు మగకాకి పిచ్చిదానా అక్కడిలాంటి తొర్రేవుండి, అందులో ఇలాంటి పామే వుండి మనం పెట్టిన గుడ్లని తిని వెళ్లదన్న గ్యారంటీ ఏముంది?... ఎక్కడికెళ్లినా ఇలాంటిదేదో ఒక అపాయం వుండనే వుంటుంది... కనక వున్న చోటనే వుండి అపాయాన్ని దాటే మార్గం చూసుకోవాలని చెప్పిన మగకాకి ఉపాయాన్ని ఆలోచించింది.

ఓ రోజు ఆ ఊరి రాజకుమారి చెలులతో చెట్టు దగ్గరున్న సరస్సులో జలకాలాడడానికి వచ్చింది... ఒంటిమీది నగలన్నీ తీసి నది ఒడ్డున పెట్టి రాకుమార్తె చెలులతో సరస్సులోకి దిగడం చూసిన చెట్టు మీదున్న మగకాకికి ఓ ఉపాయం తోచింది. వెంటనే ఒడ్డున పెట్టిన నగలలోంచి ఓ పెద్ద చంద్రహారం ముక్కున కరుచుకుని ఎగురుకుంటూ వెళ్లి చెట్టు తొర్రలో పడేసింది.

ఈ సంఘటన రాకుమార్తె చెలులు అందరూ చూశారు. వెంటనే రాజభటులను రప్పించి, చెట్టు తొర్రని తవ్వి నగ తీయమన్నారు... భటులు తొర్ర తవ్వగానే అందులో వున్న పాము బుస్సున బయిటికొచ్చి పడగెత్తింది... వెంటనే భటులు దాన్ని చంపేశారు. చంద్రహారాన్ని తీసి కెళ్లి రాకుమార్తెకిచ్చారు. అటు వాళ్ల నగ వాళ్లకు దొరికింది. ఇటు వాయస మిధునానికి పాము బెడద తప్పింది... అని కథ చెప్పి, ఆయన "కుసుమా! మనం ఈ కథ నుంచి నేర్చుకున్న నీతి ఏమిటో తెలుసునా?... వున్న చోట ఏదో ఇబ్బంది వుందని మరోచోటికెడితే అక్కడ ఇంత కన్నా పెద్ద ఇబ్బంది వచ్చిపడొచ్చు. ఇబ్బందికి కాకిలా పరిష్కారమార్గం చూడాలే కాని, అక్కడ నుంచి ఇంకో చోటికి వెళ్లడం పరిష్కారం కాదనే సరికి గోమతి కూతుళ్లు చేబదుళ్లకు రాకుండా వుండే మార్గం ఏమిటా అని తలలు పగిలేలా ఆలోచించడం మొదలుపెట్టాం...!

'మీకేదైనా ఐడియా క్లిక్ అయితే మాకు చెప్పండేం...!?' ●